క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ గెలుపు లాంఛనమే..


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు దానియేల్, డీవీ

ఇల్లెందు: ఎన్నో ప్రలోభాలు, ఒత్తిడులు, బెదిరింపులకు పాల్పడినా ఓటర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు బెదిరిపోకుండా పోరాడి గెలిచారని, ఇల్లెందులో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య గెలుపు ఖాయం అయిందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దొడ్డా డానియేల్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా నాయకుడు దేవరకొండ శంకర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్రగడ వంశీ అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండు నెలల నుంచి ప్రలోభాలు పెట్టినా, కాంగ్రెస్ నేతలను ఇబ్బందులకు గురి చేసినా బెదరకుండా ఓటేశారని తెలిపారు. ఇక్కడి నుంచి రెండు సార్లు గెలిచిన ప్రజాప్రతినిధులు పార్టీకి దూరం అయినా... ఓటర్లు, కార్యకర్తలు మాత్రం దూరం కాలేదని చెప్పటానికి రేపటి విజయమే నాంది అన్నారు. ఉమ్మడి జిల్లాలో పదికి పది గెలువబోతున్నామని రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టటం ఖాయం అన్నారు. ఓటేసిన ప్రజలకు, కాంగ్రెస్, మిత్రపక్షాల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌దే విజయం..


మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే ప్రజలు మొగ్గు చూపించారని, అన్ని సర్వే ఫలితాలు ఇప్పటికే స్పష్టం చేశాయని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోందని, దాన్ని ఆపే శక్తి ఎవరికీ లేదదన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 స్థానాల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగిస్తుందన్నారు. కొత్తగూడెంలో కాంగ్రెస్ బలపర్చిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విజయం సాధిస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎట్టకేలకు బీటీ రోడ్డు నిర్మాణం


కోటల్ల గ్రామానికి నిర్మించిన బీటీ రోడ్డు

టేకులపల్లి: తొమ్మిదోమైలు తండా పంచాయతీ కోటల్ల గ్రామస్తుల దశాబ్దాల కల ఎట్టకేలకు నెరవేరింది. తొమ్మిదోమైలు తండా నుంచి కోటల్లకు మూడు కిలోమీటర్లు పక్కా రోడ్డు లేక ఇక్కడ నివసిస్తున్న ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాక్షిలోనూ పలుమార్లు వార్తా కథనాలు ప్రచురితం అయ్యాయి. ఈ నేపథ్యంలోనే 2023–24 ఆర్థిక సంవత్సరం డీఎంఎఫ్‌టీ నిధులు రూ.3 కోట్లు మంజూరయ్యాయి. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 20న ఎమ్మెల్యే హరిప్రియ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పంచాయతీ రాజ్ ఏఈ నవీన్ పర్యవేక్షణలో ప్రధాన రహదారి నుంచి కోటల్ల గ్రామం చివరి వరకు 3.5 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణం రెండు రోజుల క్రితమే పూర్తి చేశారు. ఈ రహదారి పరిధిలో పది కల్వర్టులు కూడా నిర్మించారు. వర్షాకాలంలో ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. బీటి రోడ్డు నిర్మాణంతో స్థానిక ఆదివాసీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వెల్లివిరిసిన చైతన్యం

- కొత్తగూడెం నియోజకవర్గంలో 76.42 శాతం పోలింగ్
- ఫలితాల కోసం ఎదురుచూపు


వేపలగడ్డలో ఓటు వేసేందుకు క్యూ కట్టిన మహిళలు(ఫైల్)

సుజాతనగర్: శాసనసభ ఎన్నికల పోలింగ్ కొత్తగూడెం నియోజకవర్గంలో గురువారం ప్రశాంతంగా ముగియడంతో ప్రస్తుతం అందరిచూపు ఫలితాల పైనే పడింది. నియోజకవర్గంలో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగించారు. సమయం దాటిన తరువాత కూడా ఓటర్లు ఉండటంతో కొన్ని సెంటర్లలో రాత్రి వరకు పోలింగ్ ప్రక్రియ నడిచింది. నియోజకవర్గంలో సుజాతనగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, కొత్తగూడెం మండలాలు ఉన్నాయి. 5 మండలాల పరిధిలో 76.42 శాతం పోలింగ్ నమోదైంది. 2018 ఎన్నికలతో పోలిస్తే 14 శాతం తక్కువగా నమోదైంది. దివ్యాంగుల కోసం ట్రై సైకిళ్లను ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు లేకుండా ఓట్లు వేశారు.

ఓటేసిన యువత..
నియోజకవర్గ వ్యాప్తంగా యువత పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్యంగా వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడంతో దూరప్రాంతాల నుంచి వచ్చి ఓటేశారు. నియోజకవర్గంలో 30 వేల నుంచి 50 వేల వరకు యువతీ, యువకులు ఉండటంతో యువ ఓటర్లను అభ్యర్థులు, నాయకులు తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు.

ఈవీఎంల్లో భవితవ్యం...
ఎన్నికలు ముగియటంతో అందరి దృష్టి ఇప్పుడు ఫలితాలపై పడింది. ఈవీఎంలలో ఎమ్మెల్యే అభ్యర్థుల భవితవ్యం నిక్షిప్తమైంది. పాల్వంచలో ఆదివారం కౌంటింగ్ జరగనుంది. ఫలితాలపై అభ్యర్థులతో పాటు ఓటర్లలో కూడా ఉత్కంఠ నెలకొంది. గెలుపు ఎవరిని వరిస్తుందోనని చర్చించుకుంటున్నారు. సాయంత్రం పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్నికల సిబ్బంది ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం, వీవీప్యాట్)లను పోలింగ్ కేంద్రాల నుంచి పాల్వంచలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు.

మండలాల వారీగా నియోజకవర్గంలో పోలింగ్

మండలం	పోలింగ్ శాతం
చుంచుపల్లి	69.53
కొత్తగూడెం	72.93
లక్ష్మీదేవిపల్లి	81.79
పాల్వంచ	76.98
సుజాతనగర్	88.98

పోలింగ్ సరళిపై చర్చ
పోలింగ్ ముగియటంతో నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాల పైనే చర్చ జరుగుతోంది. ఈ సెగ్మెంట్ పరిధిలో మునుపెన్నడూ లేనివిధంగా 30 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 11 మంది వివిధ పార్టీల నుంచి పోటీ చేయగా... మిగిలిన వారంతా స్వతంత్రులే. గత ఎన్నికల్లో 9 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేయగా ప్రస్తుతం 19 మంది స్వతంత్రులు బరిలో నిలిచారు. ఆయా రాజకీయ పార్టీలు పోలింగ్ సరళిని విశ్లేషించుకునే పనిలో నిమగ్నమయ్యారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓట్ల లెక్కల్లో నిమగ్నమయ్యారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు, సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి జలగం వెంకట్రావు మధ్యే పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి..


మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోవడం గొప్ప అనుభూతి. రాజకీయాల గురించి తెలుసు. చట్ట సభలకు ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఎవరు గెలిచినా ప్రజా సమస్యలు పరిష్కరిస్తేనే ఓటు విలువ పెరుగుతుంది.
– కొల్లూరి లావణ్య, సుజాతనగర్

ఓటు వేయడం ఆనందంగా ఉంది..


మొదటిసారి ఓటు వేయడం ఆనందాన్ని కలిగించింది. మొదటిసారి ఓటుహక్కును వినియోగించుకొని పరోక్షంగా ప్రజాస్వామ్యంలో భాగస్వాములం అయ్యామనే భావన బావుంది. భవిష్యత్‌లో కూడా తప్పకుండా ఓటు వేస్తా.
– గజేంద్రుల లావణ్య, సుజాతనగర్

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం


జూలూరుపాడులో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్యసిబ్బంది


పాల్వంచ: ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

జూలూరుపాడు: ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం జూలూరుపాడులో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ మహమ్మారిని పారదోలుదాం.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్ మాట్లాడుతూ.. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, వైద్యుల సూచన మేరకు మందులు వాడితే ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు జీవితా కాలాన్ని పెంచుకోవచ్చన్నారు. ఎయిడ్స్ వ్యాధి బారిన యువత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి సోకిన వారిని అంటరాని వారిగా చూడరాదని, సహజీవనం, తాగు నీరు, ఆహారం, వస్తువుల వలన వ్యాధి ఒకరిని నుంచి మరొకరికి సంక్రమించదన్నారు. రక్త మార్పిడి, సూదులు, లైంగిక సంబంధాల వల్ల వ్యాధి సోకుతుందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ తేజశ్వని, సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎస్ రత్నకుమార్, హెచ్‌వీలు సుభద్రమ్మ, రాధిక, ఏఎన్‌ఎంలు తార, ఆదిలక్ష్మి, ఝాన్సీరాణి, వెంకటముత్యం, రాజమ్మ, మంగమ్మ, సుజాత, రీనా, అనూష, రాణి, జీజా, సావిత్రి, పార్వతి, సుశీల, నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాల్వంచ: ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎర్రం చిన్నప్పయ్య అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా జాతీయ సేవా పథకం, పాల్వంచ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎయిడ్స్ ర్యాలీని కళాశాల నుంచి ఇందిరా కాలనీ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీఒక్కరు ఎయిడ్స్ రోగులతో ప్రేమతో, సానుభూతితో వ్యవహరించాలన్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, రక్తమార్పిడి సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జె.అబ్రహం, అధ్యాపకులు డాక్టర్ పి.విజయ్‌కుమార్, హెల్త్ క్లబ్ ఇన్‌చార్జ్ ఎస్.శ్రీదేవి, అధ్యాపకులు లీల, సౌమ్య, విజయ జోషి, భాస్కర్‌రావు, హారిక, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎవరు బాధ్యులు..?


పాఠశాల ఆవరణలో వ్యర్థాలు

టేకులపల్లి: మండలంలోని తొమ్మిదోమైలు తండా ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు (156, 157) పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఎన్నికలు జరిగాయి. ఎన్నికల సిబ్బంది బుధవారం రాత్రి భోజనం, గురువారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఆరగించి వ్యర్థాలను పాఠశాల ఆవరణలోనే పడేశారు. ఇదే ఆవరణలోని పాఠశాల, అంగన్‌వాడీలకు సెలవు కావడంతో పిల్లల కంట పడలేదు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సిన గ్రామ పంచాయతీ నిర్లక్ష్యంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

'గూడెం' ప్రజలను గుండెల్లో పెట్టుకుంటా..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రజలను తన గుండెల్లో పెట్టుకొని చూస్తానని, రాబోయేది మన ప్రభుత్వమేనని, కొత్తగూడెం నియోజకవర్గ సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి కూనంనేని సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను నామినేషన్ వేసిన నాటి నుంచి ఎన్నికలు జరిగే వరకు తన కోసం కష్టపడుతూ తన వెన్నంటి ఉండి రేయింబగళ్లు ప్రచారంలో పాల్గొన్న ప్రతి నాయకుడికీ, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు, కొత్తగూడెం పట్టణ ప్రజలకు రుణపడి ఉంటానని, అందరికీ పాదాభివందనాలు తెలిపారు.

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది కాంగ్రెస్సే..


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంరూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని జిల్లా కాంగ్రెస్ నాయకులు తూముచౌదరి, ఆళ్లమురళి, శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం చుంచుపల్లి మండలంలోని పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్‌ఎస్ పాలకులకు ప్రజలు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. ఆదివారం ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. తద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ బలపర్చిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గెలుపు ఖాయమన్నారు. పొత్తులో కొత్తగూడెం నియోజకవర్గం టికెట్ సీపీఐకి కేటాయించినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతోపాటు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేశామన్నారు. గిడ్లపర్యం జ్యోతిరావు, తోట దేవీప్రసన్న, సుందర్‌లాల్‌కోరి, లక్ష్మణ్ అగ్గవాల్ పాల్గొన్నారు.

ఇల్లెందులో తగ్గిన పోలింగ్ శాతం


ఓటు వేసేందుకు క్యూలో ఓటర్లు (ఫైల్)

ఇల్లెందు: గతంతో పోలిస్తే ఈసారి ఓటింగ్ శాతం తగ్గింది. 2018లో ఇల్లెందు నియోజకవర్గంలో 1,96,798 మంది ఓటర్లు ఉండగా ఈ దఫా 2,19,569 మంది ఓటర్లు ఉన్నారు. ఇక 2018లో 1,96,798 మంది ఓటర్లు ఉండగా 1,61,560 ఓట్లు పోలయ్యాయి. 82.09 శాతం నమోదు అయింది. ఈ దఫా 2,19,569 ఓట్లకు 1,76,840 మంది ఓటు వేశారు. 80.54 శాతం ఓటింగ్ జరిగింది. ఇందులో పురుషులు 1,07,909 మందికి 87,421 మంది ఓటు వేశారు. స్త్రీలు 1,11,658 మందికి 89,418 మంది ఓటు వేశారు. 42,729 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. అధికారులు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని సభలు, సమావేశాలు పెట్టి ఓటర్లకు చైతన్యం కల్పించినా ఓటు వేసేందుకు ముఖం చాటేశారు. ముందు నుంచి అటు అధికార బీఆర్‌ఎస్, ఇటు ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్‌తో పాటు బీజేపీ, బీఎస్‌పీలు ఓటర్లకు భారీగా తాయిలాలు అందజేస్తారని ఆశించారు. కాంగ్రెస్ మాత్రం వారం ముందే తమదైన శైలీలో 75 శాతం ఓటుకు రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేసింది. ఇక అధికార బీఆర్‌ఎస్ ఎన్నికలకు ముందు రోజు ఓటుకు రూ.1200 నుంచి 1500 చొప్పున 50 నుంచి 60 శాతం మందికి పంపిణీ చేశారు. ఓటింగ్ నాడే పంపిణీ చేయాల్సి ఉండటంతో కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులు బయటికి రాలేదు. డబ్బులు అందని వారు కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. మునుపెన్నడూ లేనంతగా ఓటర్లకు డబ్బు పంపిణీ బహిరంగం కావటం, డబ్బులు అందలేదని ఆందోళనలు చేసినా ఎన్నికల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చగా మిగిలింది.

కూడికలు.. తీసివేతలు !



సుజాతనగర్: ఎమ్మెల్యే అభ్యర్థులకు చెందిన ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు ఓట్లను లెక్కలేసుకుంటున్నారు. ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడతాయని బూత్ స్థాయి కార్యకర్తలతో జరుపుతున్నారు. ఆయా పోలింగ్ బూత్‌ల్లో నమోదైన ఓట్ల వివరాలను తెప్పించుకుని గెలుపోటములపై సమాలోచన చేస్తున్నారు. తమకు పట్టున్న ప్రాంతాల్లో ఓట్లు క్రాసింగ్ జరిగాయన్న సమాచారంతో గెలుపుపై విశ్వాసం కోల్పోతున్నారు. కలసి వస్తుందనుకున్న చోట్ల ఓట్లు గల్లంతు కావడం... కాదనుకున్న చోట పెద్ద ఎత్తున ఓట్లు నమోదు కావడం నాయకులను ఆందోళనకు గురిచేస్తోంది. మండలంలోని 24 పోలింగ్ కేంద్రాల పరిధిలో 21,830 మంది ఓటర్లకు గాను, 19,425 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 88.98 శాతంతో మండలంలో పోలింగ్ శాతం నమోదైంది. గతం కంటే ఈ సారి పోలింగ్ శాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో.. తమ ప్రచార తీరుతెన్నులను సమీక్షించుకుంటున్నారు.

వెలవెలబోయిన పార్టీ కార్యాలయాలు


బోసి పోయిన బీజేపీ కార్యాలయం

ఇల్లెందు: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కార్యకర్తలు, నాయకులతో సందడిగా కనిపించిన పలు రాజకీయ పార్టీల కార్యాలయాలు ఎన్నికలు ముగియడంతో నేడు వెలవెలబోతున్నాయి. ఆయా కార్యాలయాల వైపు కన్నెత్తి చూసిన వారే లేరు. నిన్నటి వరకు బిజీబిజీగా ఉన్న నాయకులు ప్రస్తుతం వారి అభ్యర్థులకు ఎన్ని ఓట్లు పోలయ్యాయనే అంచనా వేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అభ్యర్థులు మాత్రం తమదే గెలుపు అనే ధీమాతో విశ్రాంతి తీసుకుంటున్నారు. విజయం ఎవరిని వరిస్తుందోనని కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఫలితాల కోసం ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా కొందరు కార్యకర్తలు తమ పార్టీ అభ్యర్థుల గెలుపుపై బెట్టింగ్‌లు వేసుకుంటున్నారు. ఎన్నికలను పురస్కరించుకుని హడావుడిగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాలు పూర్తిగా మూతబడ్డాయి.

టేకులపల్లిలో 86.08 శాతం పోలింగ్


94 శాతం ఓటింగ్ నమోదైన మద్రాస్ తండా పోలింగ్ కేంద్రం

టేకులపల్లి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం టేకులపల్లి మండలంలోని 44 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలానికి చెందిన ఓటర్లు పెద్ద సంఖ్యలో కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. తొలిసారి ఓటు హక్కు వచ్చిన యువత ఉత్సాహంగా కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. స్టేషన్ తడికలపూడి పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో ఉదయం 7.30 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. మండలంలో మొత్తం 44 పోలింగ్ కేంద్రాలు ఉండగా మహిళలు 20,016, పురుషులు 19,899 మొత్తం 39,965 మంది ఓటర్లు ఉన్నారు. 34,402 మంది ఓటు వేశారు. మండలంలో 86.08 శాతం పోలింగ్ నమోదు అయింది. మండలంలో 90 శాతానికి పైగా 7 కేంద్రాల్లో పోలింగ్ నమోదు కాగా మద్రాస్ తండాలో అధికంగా 94 శాతం, అత్యల్పంగా టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 161 పోలింగ్ కేంద్రంలో 77.53 శాతం నమోదు అయింది. బర్లగూడెంకు చెందిన పూనెం నరేందర్ ఓటు వేరేవాళ్లు వేయడంతో చాలెంజింగ్ ఓటు ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నాడు. పీఓలు, ఏపీఓలు, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ అందరూ కలిసి మండలంలో సుమారు 200 మంది ఎన్నికల విధులు నిర్వహించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు రమణారెడ్డి, రంజిత్‌లు మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

సుజాతనగర్‌లో 88.98 శాతం

సుజాతనగర్: గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మండలంలో 88.98 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 21,830 మంది ఓటర్లు ఉండగా 19,425 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 10,812 మంది పురుషులకు గాను 9,646 మంది, 11,018 మహిళా ఓటర్లకు గాను 9,779 మంది ఓటు వేశారు. మొత్తం 24 కేంద్రాల్లో ఎన్నికలు జరిగాయి. ఆయా గ్రామాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధి, చదువు నిమిత్తం ఆయా ప్రాంతాలకు వెళ్లిన యువతీ, యువకులు స్వగ్రామాలకు చేరుకొని ఓట్లు వేశారు. నూతనంగా ఓటుహక్కు పొందిన యువతీ యువకులు సైతం ఓటింగ్‌లో పాల్గొన్నారు. మొత్తంగా 24 పోలింగ్ కేంద్రాల పరిధిలో 88.98 శాతం పోలింగ్ నమోదైంది. 2018లో జరిగిన ఎన్నికల్లో 91.15 శాతం పోలింగ్ నమోదైంది.

ముఖం చాటేసిన 13,038 మంది ఓటర్లు

- ఏడు పోలింగ్ బూత్‌లలో 90శాతానికి మించి పోలింగ్
- మేడికుంటలో అత్యధికం.. సుభాష్‌నగర్‌లో అత్యల్పం


అత్యధిక పోలింగ్ శాతం నమోదైన పోచారం తండా గ్రామం

ఇల్లెందురూరల్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. చివరిదైన ఓట్ల లెక్కింపు మాత్రమే మిగిలి ఉంది. నియోజకవర్గంలో అత్యధికంగా ఓటర్లు ఉన్న ఇల్లెందు మండలంలో 45,774 మంది ఓటర్లకు గాను 80.37 శాతంతో 32,736 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 13,038 మంది ఓటుకు దూరంగా ఉన్నారు.

రెండు పర్యాయాలుగా ఇలా..
మండలంలో 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 43,225 మంది ఓటర్లకు గాను 76.64 శాతంతో 33,131 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 10,094 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 43,554 మంది ఓటర్లకు గాను 81.57 శాతంతో 35,531 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 8,023 మంది ఓటుకు దూరంగా ఉన్నారు.

ఏజెన్సీ ఓటర్లే నయం...
మండలంలో మొత్తం 52 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఆయా బూత్‌ల పరిధిలో నిర్వహించిన పోలింగ్‌లో మొత్తంగా ఐదు పోలింగ్ బూత్‌లలో 90 శాతంకు మించి పోలింగ్ నమోదైంది. అత్యధికంగా మేడికుంట, పోచారంతండా పోలింగ్ బూత్‌లలో 94 శాతం నమోదు కాగా పోచారంలో 93.57 శాతం, మిట్టపల్లిలో 90.83 శాతం, మాణిక్యారంలో 90.56 శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా సుభాష్‌నగర్‌లో 67.87 శాతం నమోదైంది. ప్రస్తుతం మండల వ్యాప్తంగా బూత్‌లలో నమోదైన పోలింగ్ శాతాన్ని పరిశీలిస్తే అత్యధికంగా ఏజెన్సీ గ్రామాలలోనే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మైదాన ప్రాంతాల స్థాయిలో అభివృద్ధి చెందిన గ్రామాలలో మాత్రం 65 నుంచి 75 శాతానికే పోలింగ్ శాతం పరిమితమైంది.

ప్రభావం చూపనున్న పల్లె ఓట్లు...
నియోజకవర్గ పరిధిలో అత్యధిక ఓటర్లు కలిగి ఉన్న మండలం ఇల్లెందు. మొత్తం ఓట్లలో 20.84 శాతంతో 45,774 ఓట్లు నమోదయ్యాయి. ఈసారి ఓటర్లు పలు కారణాలతో ఓటు వేసేందుకు ముఖం చాటేయడంతో గతేడాది కంటే తక్కువ శాతమే పోలింగ్ నమోదైంది.

అత్యధిక ఓటర్లను కలిగి ఉండటంతో ఇల్లెందు మండలం ఎన్నికల్లో ప్రభావవంతమైనదిగా గుర్తింపు పొందింది. అయితే ఎవరికి వారు అత్యధికంగా పోలైన పల్లెలు తమకు అనుకూలంగా ఉంటాయని భావిస్తూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన ఎన్నికల హడావుడి !



ఇల్లెందు: 13 రోజుల పాటు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం హోరెత్తింది. అభ్యర్థుల వెనుక నాయకులు, కార్యకర్తలు, కార్లు, జీపులు, ప్రచార రథాల వెంట వెంట వస్తుండటంతో గ్రామాల్లో సందడి నెలకొంది. గురువారం పోలింగ్ జరిగింది. దీంతో గ్రామాలు నిశబ్దంగా మారాయి. పగలనక, రాత్రనకా తిరిగిన కార్యకర్తలు అలిసిపోయి సేద దీరుతున్నారు. పోలింగ్ ప్రక్రియతో ముగియడంతో వివిధ పార్టీ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. జీపులు, కార్లు, మోటార్ సైకిళ్లు చెట్ల కింద, షెడ్ల కింద విశ్రాంతి తీసుకుంటున్నాయి. సభలు, సమావేశాలు, వాగ్దానాలు, హామీలతో జోరుగా సాగిన ఎన్నికల ప్రచారం తరువాత పోలింగ్ ముగిసినప్పటికీ అభ్యర్థుల భవితవ్యం భద్రపర్చిన ఈవీఎంలలో దాగి ఉంది. నాయకులు తన అనుచరులతో వివిధ గ్రామాలు, వార్డులు, బస్తీల వారీగా పోలైన ఓట్లు, ఎవరి వైపు ఓటరు మొగ్గు చూపారనే విషయంలో వాస్తవాలు తెలుసుకునే ప్రయత్నంలో నిమగ్నమన్నారు. ఓటింగ్ శాతం తగ్గటంతో కొంతమందికి లాభమని, మరి కొంతమందికి నష్టం అని లెక్కలేసుకుంటున్నారు. ఉదయం నుంచే మెజార్టీ బూత్‌లలో హస్తంకు హవా సాగిందంటున్నారు. గతంలో న్యూడెమోక్రసీకి బలమైన ఓటు బ్యాంకు ఉండేది. ఆ పార్టీ మాణిక్యారం, కొమరారం, పోలారం, మర్రిగూడెం పంచాయతీలు పెట్టని కోటగా బలమైన ఓటు బ్యాంకు కలిగి ఉండగా ఈసారి తమ ఓటు బ్యాంకు చెందిరిందని ఆ పార్టీ నేతలే గుసగుసలాడుతున్నారు. బయ్యారం మండలంలో ఏజెన్సీలో కూడా నాలుగైదు పంచాయతీల్లో బలమైన ఓటు బ్యాంకు కలిగిన ఎన్డీ గడ్డు పరిస్థితి ఎదుర్కొంది. బయ్యారం, గార్ల, కామేపల్లిలో హస్తం అత్యధిక ఓటింగ్ ఓటు నమోదు చేసుకుందని, టేకులపల్లిలో కొంత కారుకు ఓటింగ్ జరిగిందంటున్నారు. 79.32 పోలింగ్ శాతం జరగడంతో ఏ పార్టీకి నష్టం, ఏ పార్టీకి లాభమవుతుందో అంతు పట్టక ఆందోళన చెందుతున్నారు. ఆదివారం కౌంటింగ్ కావడంతో నాయకులు, కార్యకర్తలు నిద్రాహారాలు మాని ఎదురు చూస్తున్నారు.